# టీ.వీ. ఉందిగా!

-చిట్టిపెద్ది ఉమ

ఆచ్ఛాదన లేని శరీరం మీద సూర్యప్రతాపం చురుక్కుమంటుంటే, ఒళ్లంతా నీరు కారుస్తుంటే తుడుచుకోవడానికి కూడా లేకుండా రెండుచేతుల్లో రెండు సంచుల బరువుతో ఉస్సూరస్సురంటూ ఇంట్లోకి అడుగుపెట్టాడు సూర్యనారాయణశాస్త్రి. ముందుగదిలో కుర్చీలో జారి కూర్చుని ఎదుటి స్టూల్‌మీద కాళ్ళు జాపుకుని అరటిపండు ఆరగిస్తూ టీవీ చూస్తున్న కొడుకు శంకరాన్ని చూడగానే ఒళ్ళు మరింత మండిపోయింది శాస్త్రిగారికి.

"ఎప్పుడూ తిండేనా? ఆ పదోతరగతి ఈజన్మలో పాసవ్వడం ఉందా? లేదా?" చెమటతో తడిసి ముద్దయిన మొహాన్ని కండువాతో తుడుచుకుంటూ అరిచారు శాస్త్రిగారు. శంకరం పదో తరగతి పరీక్షలకి మూడేళ్లనుంచీ వెళ్లి వస్తూ అటు బోర్డు సహనానికీ, ఇటు తండ్రి సహనానికీ పరీక్ష పెడుతున్నాడు.

"అబ్బ...ఎందుకండీ అలా అరుస్తారు. పాపం పిల్లాడు పొద్దస్తమానూ ఏం చదువుతాడు?" జానకమ్మ భర్త మీద విసుక్కుని సంచుల్లో సామాన్లు బయటికి తీయడం మొదలుపెట్టింది.

సంచుల నిండా స్వీట్లు, పళ్ళు, బియ్యం, పప్పులు.. కొబ్బరిచెక్కలు...రాంనగర్ చుట్టుపక్కల అన్ని కాలనీల్లోనూ మంత్రం క్షుణ్ణంగా తెలిసిన బ్రాహ్మడని శాస్త్రిగారికి మంచి పేరు ఉంది.

ఆయనంటే మంచి గౌరవం ఉంది.

అందుకే రోజూ ఎక్కడో అక్కడ పూజలు, వ్రతాలు అంటూ వెళ్ళి వస్తూనే ఉంటారు. సీజన్‌లో పెళ్ళిళ్ళు..ఒడుగులు సరేసరి. సంపాదన బాగానే ఉంటుంది. అదీ కాకుండా ఎప్పుడూ ఇంటినిండా స్వీట్లు, పళ్ళు... కొబ్బరి చెక్కలు సరేసరి. శంకరం తల్లి చాటుగా అందించిన లడ్డూలు, ఏపిల్‌పండు, గారెలు పట్టుకుని వేరేరూమ్‌లోకి వెళ్ళిపోయాడు వాటి పని పట్టడానికి. ఇంటినిండా ఎప్పుడూ ఉండే స్వీట్లు, పళ్ళు అన్నీ తిని తిని శంకరం గున్న ఏనుగులా తయారయ్యాడు. స్కూల్‌కి వెళ్లి రావడం అన్నది కూడా లేదేమో విపరీతమైన ఒళ్ళు వచ్చింది. బోలెడు సంపాదిస్తున్నాడు కాబట్టి అమ్మాయి అరుణకి మంచి సంబంధం తెచ్చి పెళ్ళిచేయగలడు కానీ..శంకరం...రోజురోజుకీ అడ్డంగా అంగుళాల్లో చుట్టుకొలత పెంచుకుంటూ పోతున్న కొడుకుని చూస్తే సూర్యనారాయణగారికి దిగులు ముంచుకొస్తుంది.

"రేపట్నించీ...ఆ వెధవని నాలుగు మంత్రం ముక్కలైనా నేర్చుకోమను. చదువు ఎలాగూ అంటుకోనంటోంది. పనికిమాలిన వెధవ...పనికిమాలిన వెధవాని"సూర్యనారాయణగారు తిట్ల దండకం చదువుతూ బావి దగ్గర చేదతో నీళ్ళు తోడుకుని నెత్తిమీద గుమ్మరించుకున్నారు.

తీరిగ్గా పడుకుని ఆదివారం ఆనందాన్ని అనుభవిస్తున్న శ్రీహరి శాస్త్రిగారి దండకాన్ని వింటూ నవ్వుకున్నాడు.

రోజుకోసారైనా శాస్త్రిగారు కొడుకుని 'పనికిమాలిన వెధవ' అని తిట్టకుండా ఉండడు. అయితే ఆ దండకం శంకరం మీద ఆవగింజంత ప్రభావమైనా చూపించదు. దున్నపోతుమీద వాన కురిసినట్టే.

"బాబాయిగారిని చూస్తే జాలేస్తుందండీ...ఆ శంకరాన్ని చూశారా. ఇటు చదువుమీద ఇంట్రెస్ట్ లేదు. అటు పౌరోహిత్యమూ పనికిరాదు. నిజంగా పనికిమాలిన వెధవే"

"అబ్బా నువ్వుకూడానా సునందా...ఎలాగో బతకలేకపోడులే. మెల్లిగా ఏదో ఓ వ్యాపారం చేసుకుంటాడు. ఇంకో రెండేళ్ళు పోయాక"

"బుర్రలో సరుకుండాలిగా వ్యాపారం చెయ్యడానికి..." సునంద తేలిగ్గా తీసిపారేసింది. శాస్త్రిగారికి మల్లే శంకరం ఒట్టి పనికిమాలిన వెధవ అన్న నమ్మకం సునందకి.

* * *

"సునందా...ఆర్ యూ రెడీ..." ఆఫీసు నుంచి ఎలాగో ఓ గంటముందు బయటపడి ఇంటికొచ్చిన శ్రీహరికి అలంకరించుకుని ఎదురుచూస్తున్న సునంద దర్శనమవుతుందనుకుంటే అప్పలమ్మలా అంట్ల చేతుల్తో కనిపించింది.

"ఏంటి సునందా. నీ పుట్టినరోజు కోరిక తీర్చకపోతే ఏడాదంతా సాధిస్తావని నేను నానా నాటకాలు ఆడి పర్మిషన్ తీసుకువస్తే ఇంకా తయారవ్వకుండా ఏం చేస్తున్నావు?"

"పనిమనిషి వస్తానని చెప్పి హ్యాండిచ్చిందండీ. ఇదిగో ఇంతవరకూ చూసి ఇంక పని మొదలుపెట్టాను"

శ్రీహరికి మహదానందంగా ఉంది. పనిపిల్ల పద్మకి లోలోపలే ధన్యవాదాలు చెప్పుకున్నాడు.

సునంద ప్లాన్ ప్రకారం మల్టీప్లెక్స్‌లో సినిమా...ఆ తర్వాత మంచి హోటల్లో డిన్నర్. వెయ్యికి కాస్త అటూ, ఇటూగా ఖర్చు. అయిష్టంగానే సునంద కోరిక కాదనలేక ఒప్పుకున్నాడు. ఒక్క పూటకి అన్నేసి వందలు జేబులోంచి ఎగిరిపోతాయి అనుకున్నప్పుడల్లా ఆనందం ఆవిరైపోతుంది శ్రీహరికి నాలుగురోజులుగా.

"మరి సినిమా..." శ్రీహరి అమాయకంగా మొహం పెట్టి అడిగాడు.

"సినిమాయా... సింగినాదమా... నేను అనుకోవడమూ...అది జరగడమూ కూడానా. దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుపడ్డట్టు మీరు ఒప్పుకుని టైంకి వచ్చినందుకు పనిమనిషి నాగా..." సునంద అంట్లు తోమి పక్కన పెడ్తూ అంది.

"పనులెక్కడికిపోతాయి. రేపు చేసుకోవచ్చు. ఎక్కడివక్కడ పడేసి బయలుదేరు" శ్రీహరి మాట వరసకి అన్నాడు.

"ప్రొద్దున్న పులిహోర... పాయసం.. బూర్లు అంటూ బోలెడు వంట చేశాను. అంట్లన్నీ సింక్ లోనే ఉన్నాయి. ఇప్పుడు తోమకపోతే రేపు ప్రొద్దున్న పిల్లలకి టిఫెన్...మీ భోజనం.. పిల్లలకి లంచ్‌బాక్స్‌లు అన్నిటికీ తడుముకోవాలి. పిల్లల యూనిఫాం.. సాక్స్‌లు ఉతక్కపోతే రేపటికి ఆరవు"

"పోనీలే...ఇంకోరోజు ఎప్పుడైనా వెళ్దాం"

"సినిమాకి అందుకోలేం కానీ కాస్సేపు సరదాగా బజార్లో తిరిగి డిన్నర్ చేసి వద్దామా... ఓ గంటలో అన్ని పనులూ అయిపోతాయి" సునంద మాటలు శ్రీహరి ఆనందాన్ని సగం తుంచేశాయి.

వెయ్యిలో సగం ఖర్చు తప్పదన్న మాట..పోనీ...సగం ఖర్చు...సగం మిగులు.

"అమ్మాయ్... సునందా... ఆ పద్మ పీనుగు ఏం చేసిందో చూశావా" జానకమ్మగారు పెరటి గుమ్మంలోంచి లోపలకి వస్తూ అంది.

"మా నాన్న చెట్టు నుంచి పడ్డాడు ఆస్పత్రికి పోవాలి అని ఏడ్చి పనికి నాగా పెట్టడమే కాకుండా డబ్బులు కూడా అడుక్కుపోయిందా...అంతా వట్టి దిట..."

"మీకెలా తెలుసు?" సునంద ఆశ్చర్యంగా చూసింది.

"కూరకి బజారుకెళ్తే దాని అమ్మ యాదమ్మ కనిపించి చెప్పింది చిరంజీవి కొత్త సినిమాకి వెళ్లిందట. ఒట్టి పని బద్ధకస్తురాలు. పని ఎగ్గొట్టడానికి రోజుకో వేషం వేస్తుంది. దీంతో చచ్చే చావుగా ఉంది అని వాపోయింది"

"యాదమ్మ వచ్చినన్నాళ్ళు ఏదో టైంకి పనయ్యేది. పద్మ పెద్దదయింది అంటూ మనిళ్ళ మీదికి దాన్ని తోలేసింది. ఇదిగో ఇది వచ్చినప్పటినుంచీ మన పాట్లు మనం పడాల్సి వస్తోంది" సునందకి ఒళ్లంతా భగభగమండిపోతోంది. పని ఎగ్గొట్టడమే కాకుండా తాము వెళ్లాలనుకున్న సినిమాకి అది వెళ్ళిపోయినందుకు.

"రేపొద్దున్న వస్తే ఆ పనికిమాలిన దాన్ని పన్లోకి రావద్దని చెప్పి చేతులు దులుపుకుందాం. మనకి వేరే పనివాళ్ళు దొరకరా ఏంటీ?" జానకమ్మ దీర్ఘంతో ఏకీభవించింది సునంద.

★ ★ ★

"సునందా రేపు నా ఫ్రెండొకడు రామవరం నుంచి వస్తున్నాడు. రెండురోజులు ఉంటాడు. ఇక్కడేదో పనిమీద వస్తున్నాడట. ఫోన్ చేశాడు" శ్రీహరి ఓరోజు సాయంత్రం ఇంటికి వస్తూనే సునందకి చెప్పాడు.



"ఎవరూ?"

"నువ్వు చూడలేదులే. చెల్లప్ప అనీ నా ఫ్రెండ్. చిన్నప్పుడు ఒకే స్కూల్లో చదువుకున్నాం. మేం వాళ్లింట్లో అద్దెకి ఉండేవాళ్లం. వాళ్లది బట్టలవ్యాపారం. వాళ్ల నాన్న ఉన్నన్నాళ్ళూ బాగానే నడిచింది. ఆ తర్వాత ఏమైందో షాప్ అమ్మేసి బాకీలు తీర్చాడుట. వేరే పని ఏదైనా వెతుక్కుంటాడట. ఏం పని దొరుకుతుందో మహా బద్ధకస్తుడు. ఒట్టి పనికిమాలిన వెధవ చెల్లప్ప"

"చెల్లని అప్ప అన్నమాట. పోనీండి మీకు మీ ఫ్రెండ్ పోలిక రాలేదు" సునంద సరదాగా టీజ్ చేసింది.

"వర్క్ ఎగ్గొట్టడంలో, ఇంట్లో పని ఎగ్గొట్టడానికి రోజుకో కొత్త కథ చెప్పడంలో మహా దిట్ట. చదువూ లేదు. ఏం ఉద్యోగం వస్తుంది వీడికి?" శ్రీహరి పైకే అనుమానం వెలిబుచ్చాడు. మర్నాడు పొద్దున్నే చిన్న బ్యాగ్‌తో దిగాడు చెల్లప్ప. సునంద అతిథి సత్కారం బాగానే చేసింది. రెండోరోజు సాయంత్రం స్వీట్ ప్యాకెట్ పట్టుకొచ్చాడు చెల్లప్ప. మొహం ఆనందంతో వెలిగిపోతోంది.

"నాకు ఓ టీవీలో స్క్రిప్ట్‌రైటర్‌గా పని దొరికింది" చిరునవ్వుతో చెప్పాడు చెల్లప్ప.

"కంగ్రాట్స్..." శ్రీహరి ఆనందం వ్యక్తం చేసినా గొంతులో కించిత్ అసూయ తొంగిచూసింది.

టీవీలో ఉద్యోగం అంటే వేలూ, లక్షలూ సంపాదన. రాజభోగం.

"ఎలా వచ్చింది.." సునంద కుతూహలంగా అడిగింది.

స్క్రిప్ట్‌రైటర్స్ కావాలన్న ప్రకటన చూసి వెళ్ళాను. ఓ సిట్యుయేషన్ ఇచ్చి ఓ ఎపిసోడ్‌కి సరిపడా స్క్రిప్ట్ రాయమన్నారు. నేనే ఫస్ట్ వచ్చాను.."

"ఏం రాశారు?" సునంద మరింత కుతూహలంగా అడిగింది.

"హీరో ఊరికి వెళ్తున్నాడు. వెళ్ళేటప్పుడు, ఆ తర్వాత ఏవైనా డైలాగ్‌లు రాయమన్నారు. అందరూ బోలెడు కథ రాశారు.

నేను రాసిందిది" ఓ కాగితం చేతిలో పెట్టాడు.

"నాన్నా నేను హైద్రాబాద్ వెళ్తున్నాను"

"మంచిది నాన్నా... మళ్ళీ ఎప్పుడు వస్తావు?"

"వారంలో వచ్చేస్తాను"

"అమ్మా...ఆశీర్వదించమ్మా... హైద్రాబాద్ వెళుతున్నాను"

"అయ్యో అపశకునం. వెళ్ళి వస్తాను అనాల్రా నాయనా"

"చెల్లీ నీకేం కావాలి చెప్పు హైద్రాబాద్‌నుంచి..."

"అన్నయ్యా ఆకుపచ్చరంగు గాజులు తీసుకురా. పచ్చగాజులు సీరియల్‌లో హీరోయిన్‌లా ఎప్పుడూ చేతినిండా గాజులు వేసుకోవాలని నా కోరిక"

ఇదిగో ఇలాగే ఇంట్లో పనిమనిషికి, పొరుగువాళ్ళకి, ఫ్రెండ్స్‌కీ అందరికీ హైద్రాబాద్ వెళ్తున్నాను అని చెప్పడంతోనే ఎపిసోడ్ పూర్తవుతుంది. కథ అర అంగుళం కదలకుండా...అందరికంటే డైలాగ్‌లు చాలా చక్కగా రాశానని డైరెక్టర్‌గారు చాలా మురిసిపోయారు. 'కథల రాయుడు. వీడికి మంచి అవకాశమే వచ్చింది' శ్రీహరి లోలోపలే అనుకున్నాడు. చెల్లప్ప పరివారంతో సహా హైద్రాబాద్ మకాం మార్చేసి నాలుగేసి సీరియల్స్‌కి స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టి నాలుగుచేతులా సంపాదించడం మొదలుపెట్టాడు.

* * *

"శశాంక్ ఎలా చదువుతున్నాడు? ఏడోతరగతి బోర్డుకే బోలెడు టెన్షన్. మా జయంత్ మ్యాథ్స్‌లో మరీ వీక్‌గా ఉన్నాడు" శ్రీహరి లంచ్ అవర్‌లో కొలీగ్ శుభంకర్‌తో మాటలు కలిపాడు.

"వెధవ బోర్డుదేముందీ...మా వాడిని బిక్యూసీ కోసం రోజూ నేనే రెండు గంటలు, మా ఆవిడో రెండుగంటలు కోచ్ చేస్తున్నాం"

"చాలామంచి పని చేస్తున్నారు. బిక్యూసీతో మొదలుపెడ్తే తర్వాత మాస్టర్ మైండ్, కెబిసీ...అబ్బో అటు పేరు, ఇటు డబ్బు. మొన్న మా అబ్బాయి ఓ సీరియల్‌లో హీరోయిన్ జడలో ఎన్ని నాగరాలు ఉన్నాయి అన్న దానికి ఆన్సర్ కరెక్ట్ గా రాసి పంపిస్తే ఇరవై తొమ్మిది అంగులాల టీవీ బహుమతిగా వచ్చింది" నరేష్ పుత్రోత్సాహంతో పొంగిపోతూ అన్నాడు.


"కలిసొచ్చే కాలం వస్తే నడిచొచ్చే కొడుకు పుడతాడు" అన్నట్టు మొన్న మా వదినగారు ఓ ఛానెల్ వాళ్ళు 'ఫోన్‌కొట్టు-డబ్బుపట్టు' ప్రోగ్రాంకి ఫోన్ చేసింది. "టమోటా రంగు తెలుసా? ఎరుపా? మూడు తర్వాత వచ్చే అంకె నాలుగా? ఐదా? మీరు ఫోన్ చేసిన ఛానెల్ పేరేమిటి?" అన్న ప్రశ్నలకి కరెక్ట్‌గా సమాధానం ఇచ్చి మూడులక్షలు గెలుచుకుంది. మా ఆవిడ పదేళ్లనుంచీ టీచర్ ఉద్యోగం చేస్తూ కూడా అంత సంపాదించలేదు" మోహనరావు వాపోయాడు.

"మా అన్నయ్య గారమ్మాయి పావని పదోతరగతి గట్టెక్కించలేక చతికిలబడింది. పెళ్లిచేద్దామంటే చదువులేదు. సంబంధాలు వెనక్కి వెళ్లాయి. ఎలారా దేవుడా అని బెంగపెట్టుకున్నాం. "పిల్ల బాగుంది వసపిట్టలా నోరు ముయ్యకుండా వాగుతుందని టీవీ యాంకర్ ఉద్యోగం కోసం ట్రై చేశాం. ఇదిగో ఇంక

## స్మార్ట్‌లుక్



తారలు తమ బరువు పెరిగాక గానీ జాగ్రత్తపడరు. ఇపుడు అమృతారావ్ బరువు తగ్గి స్మార్ట్‌గా తయారవ్వాలనుకుంటోంది. అందుకేనేమో హెల్త్‌క్లబ్‌ల చుట్టూ తెగ తిరుగుతోంది. మొన్నామధ్య ఓ హెల్త్‌క్లబ్‌లో జాయినైన ఈ భామ పదికిలోలకి పైగా బరువు తగ్గిందిట. 'నిక్కీనీల్ ఎన్ నిక్కీ' చిత్రంలో హీరోయిన్ అయిన ఈ భామ ఇప్పుడు షూటింగ్స్‌తో పాటూ హెల్త్‌క్లబ్స్ చుట్టూ తిరుగుతోంది. అందం పట్ల ఇంత శ్రద్ధ మామూలే కదా!



ఇప్పుడు పెళ్లికొడుకులు లైన్ కడ్తున్నారు'' కాస్త దూరంగా కూర్చుని వీళ్లమాటలు వింటున్న దామోదర్ లంచ్‌బాక్స్‌తో సహా వచ్చి కూర్చున్నాడు.

సర్వకామితో ఫలదాయిని, సర్వానోగ నివారిణిలాగ సమస్య ఏదైనా సొల్యూషన్ ఒక్కటే అన్నట్టు అన్నింటికీ టీవీ మీద ఆశలు పెట్టుకుంటున్నారు జనం. ఏనాడో ఓ నాడు టీవీ మాత కరుణించకపోదా? కాసుల వర్షం కాకపోతే గిఫ్ట్‌ల వర్షమైనా కురిపించకపోదా అన్న ఆశ టీవీకి అతుక్కుపోయేట్టు చేస్తోంది.

మేజిక్ బాక్స్‌లోంచి వస్తున్నట్టు వాషింగ్ మెషీన్లు, మైక్రోవేవ్ ఓవెన్‌ల నుంచి పట్టుచీరలు, బంగారు నగల దాకా అన్నీ అందులోంచి రాలుతున్నాయి మరి. అరగంటలో అదృష్టవంతులని లక్షాధికారులుగా, కోటీశ్వరులుగా చేసేస్తోంది టీవీ. అన్నింటికీ టీవీ ఉందిగా అన్న ఆశ. భరోసా. 'నిజమేనేమో' పనికిమాలిన వెధవ అని రోజుకి నాలుగుసార్లు తండ్రితో తిట్లు తినే శంకరం ఓ టీవీ డైరెక్టర్ కళ్లల్లో పడ్డాడు. అలాంటి భారీకాయం కోసమే వెతుకుతున్నామని చెప్పి తన సీరియల్లో ఓ వేషం ఇప్పించాడు. ఆరునెలల్లో అరడజను ఛానెళ్లల్లో అరడజను సీరియల్స్‌లో వేషాలు వేస్తూ శంకరం పెద్ద పేరున్న నటుడైపోయాడు.

శాస్త్రిగారు అద్దెవాటా వదిలేసి సొంత బంగళాకి వెళ్ళిపోయారు.

శ్రీహరి ఆలోచనల్లో పడ్డాడు.

* * *

"ఏవండోయ్... ఇదిగో మన పనిమనిషి పద్మ. ఇప్పుడు హీరోయిన్ వేషాలు వేస్తోంది. పనికిమాలినదని రోజో తిట్టేదాన్ని. ఎలా ఎదిగిపోయిందో...'' ఆఫీస్‌నుంచి వచ్చిన శ్రీహరికి మంచినీళ్ళు అందిస్తూ టీవీ వైపు చూపించింది సునంద. పద్మ పనిచేసే ఇళ్లల్లో టీవీలో చిల్లరమల్లర పనులు చేసే బ్రహ్మానందం ఇల్లు ఒకటి. రోజుకో దొంగ ఏడుపు ఏడ్చి పని ఎగ్గొట్టే పద్మ ఏడుపులో బ్రహ్మాండమైన నటన చూసిన బ్రహ్మానందం పద్మకి ఓ ఏడుపుగొట్టు సీరియల్లో ఓ ఏడుపుగొట్టు పాత్ర ఇప్పించాడు.

పద్మ సహజంగానే బ్రహ్మాండంగా నటించి ఓహో అనిపించుకుంది.

అంటే పద్ద పాచిపని మానేసి పది సీరియళ్లల్లో నటించే పని మొదలుపెట్టింది.దాని తల్లి యాదమ్మ కూడా కూతురితో పాటు అడపాదడపా టీవీ వేషాలేస్తోంది. చూస్తుండగానే పద్మ పూరిగుడిసె నుంచి ఫ్లాట్‌కి మారిపోయి కార్లలో తిరుగుతోంది. అర అడుగు వెడల్పున్న పట్టుచీర కట్టుకుని మొగుడు ఎవరి వలలోనో చిక్కుకున్నాడని ఏడుస్తూ వాపోతోంది పద్మ.

"ఎంతసేపూ ఈ సీరియళ్ల గోలేనా. జయంత్‌ని పట్టించుకోకుండా సీరియల్ ముందు కూర్చుంటున్నావు. వాడి ప్రోగ్రెస్ రిపోర్ట్ వచ్చిందా. ఈసారైనా లెక్కల్లో మార్కులు బాగా వచ్చాయా లేదా?''

"ఏరా జయంత్? నీ ప్రోగ్రెస్ రిపోర్ట్ ఏదీ?'' అప్పుడే ఆడుకుని లోపలికి వస్తున్న జయంత్ క్రికెట్ బ్యాట్ లోపలపెట్టి ప్రోగ్రెస్ రిపోర్ట్ తెచ్చి తండ్రికి ఇచ్చాడు. ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో అంకెలు చూసిన శ్రీహరి అగ్గిమీద గుగ్గిలం అయి రంకెలు వేయడం ప్రారంభించాడు. ఏ సబ్జెక్ట్‌లోనూ నాలుగు పదులు దాట లేదు మార్కులు. లెక్కల్లో మరీ అధ్వాన్నం పాతిక.

"అటు స్కూల్‌కీ...ఇటు ట్యూషన్‌కీ బోలెడు డబ్బులు పోస్తున్నాను మార్కులు మాత్రం రావడం లేదు''

"అబ్బ ఎందుకండీ అలా తిడతారు. లెక్కల్లో మార్కులు రాకపోతే నష్టమేమీ లేదు''

"ఆఁ...నష్టమేమీ లేదు. ఏం నీ అబ్బ డబ్బు ఏమైనా ఎస్టేట్ రాసి ఇస్తున్నాడా కూర్చుని తినడానికి. ఇలా పనికిమాలిన వెధవలా తయారయితే రేపు ప్రొద్దున్న ఏం ఉద్యోగం వస్తుంది. ఆఖరికి గుమస్తా ఉద్యోగానికి కూడా ఐఎఎస్ లెవెల్లో తెలివి ఉండా అని పరీక్షలు పెడుతున్నారు'' శ్రీహరి సునంద మీద విరుచుకుపడ్డాడు.

"వెధవ గుమస్తా ఉద్యోగం చేసుకునే ఖర్మ ఏంటి వాడికి. చూస్తుండండి ఏ టీవీ ఛానెల్‌లోనో హీరో అయిపోతాడు. వాడికేంటి వాడి జాతకంలో రాజభోగం అని రాసి ఉంది'' సునంద ఎర్రగా, బొద్దుగా, ముద్దుగా మెరిసిపోతున్న కొడుకు వంక మురిపెంగా చూస్తూ అంది.

శ్రీహరికి తను అనవసరంగా టెన్షన్ పడిపోయి జయంత్‌నీ, సునందనీ టెన్షన్ పెడుతున్నానేమో అన్న అనుమానం వచ్చింది. అవును..లెక్కలు రాకపోతేనేం. లెక్కల్లో ఫెయిలైతేనేం, అసలు చదువు రాకపోతేనేం, ఏ పుట్టలో ఏ పాముందో లాగ ఎవరి అదృష్టం ఎక్కడుందో. వైట్ ఎలిఫెంట్ అనుకున్న శంకరం ఇప్పుడు గొప్పవాడైపోలేదూ. అందరి పాత బట్టలూ అడిగి పట్టుకెళ్ళి కట్టుకునే పద్మ ఇప్పుడు నిజం పట్టుచీరలు కట్టుకోవడం లేదూ.

వరహాల్రావు వదినగారు పదినిముషాల్లో పదిలక్షలు సంపాదించలేదూ. కలిసొచ్చే కాలం వస్తే కెబీసీ నుంచి కాల్ వస్తుంది అన్నది కొత్త నానుడి.

అనవసరంగా ఈ బెంగలూ, భయాలూ టెన్షన్లూ అనవసరం. 'టీవీ ఉందిగా' శ్రీహరి గుండె ఒక్కసారిగా దూదిపింజెలా తేలికైపోయింది.

★

## ఆన్‌లైన్ అమెరికన్లు

ఏ క్షణంలో చూసినా 70 మిలియన్ల అమెరికన్లు ఆన్‌లైన్ మీద వుంటున్నారట. సరాసరిన ఒక అమెరికన్ ప్రతిరోజూ టీవీ, ఇంటర్నెట్, సెల్‌ఫోన్లతో తొమ్మిదిగంటలు గడుపుతాడని ఒక అంచనాలో తేలింది. దీన్నిబట్టి ఈ అధునాతన యుగంలో మనిషికీ మనిషికీ మధ్య వ్యక్తిగతమైన సంబంధాలు కరువైపోయి జీవితాలు ఎలక్ట్రానిక్ సంబంధాలకి మాత్రమే పరిమితమైపోతున్నాయని, మనుషులు యాంత్రికంగా తయారైపోయారని, వాళ్లకీ రోబోలకి ఏమాత్రం తేడా ఉండడంలేదని నిపుణులు అంటున్నారు. అంతేకాదు, ఎలక్ట్రానిక్ మీడియాపై ఎంత ఆధారవడిపోతున్నారంటే నిజమేదో, అబద్ధమేదో తెలుసుకోలేని స్థితికి దిగజారిపోయారని అంటున్నారు. అమెరికన్ల విషయమే కాదు, క్రమక్రమంగా మనవాళ్ల పరిస్థితీ అలాగే పరిణమిస్తోంది.

## స్థూలకాయుల మయం

అమెరికాలోని మధ్య వయస్కుల్లో 90 శాతం మగవాళ్ళు, 70 శాతం ఆడవాళ్లు స్థూలకాయులని నేషనల్ రీసెర్చ్ టీమ్ పరిశీలనలో తేలింది. మున్ముందు దేశానికి ఇదొక పెద్ద ఆరోగ్య సమస్యగా మారుతుందని నేషనల్ హార్ట్ అండ్ లంగ్ ఇన్‌స్టిట్యూట్ వారు అంటున్నారు. అయితే తెల్లవాళ్లల్లోకన్నా నల్లవాళ్లల్లో ఎక్కువమంది స్థూలకాయులు ఉంటున్నారన్నది కొసమెరుపు.

-తటవర్తి

